సమాజహితం

WWW.SAMAJAHITHAM.COM | PRGI : T/TG/2026/0819/5664/1384

సంపుటి: 01 సంచిక: 06 సమాజహితం - తెలుగు దినపత్రిక ఎడిటర్: హరీష్ ఆచార్య బుధవారం 11-11-2026 పేజీలు: 06 వెల: రూ.2.00





2వ పేజీలో...

ఉద్యోగి 48 గంటలు కస్టడీలో ఉంటే

సస్పెన్షన్ అయినట్లే

- ప్రభుత్వ ఉద్యోగులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- 48 గంటలకు మించి కస్టడీలో ఉంటే డీమ్డ్ సస్పెన్షన్‌గా పరిగణించాలన్న న్యాయస్థానం
- సస్పెన్షన్ కోసం ప్రత్యేక ఉత్తర్వులు అవసరం లేదని స్పష్టీకరణ
- లంచం కేసు నిందితుడిని అదే పోస్టులో నియమించడంపై ఆశ్చర్యం

ఢిల్లీ,: ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్‌కు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏదైనా కేసులో అరెస్టయిన ప్రభుత్వ ఉద్యోగి 48 గంటలకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే, సదరు ఉద్యోగి ఆటోమేటిక్‌గా సస్పెన్షన్‌లో ఉన్నట్లే (డీమ్డ్ సస్పెన్షన్) పరిగణించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇందుకు ప్రత్యేకంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. బిహార్‌లోని సమస్తీపూర్ సదర్ ఆసుపత్రి మేనేజర్ విశ్వజీత్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణసందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.




యూపీఏ ప్రభుత్వంలో

జోక్యం చేసుకోలేదు

సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు

2వ పేజీలో...

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జీవితానికి సంబంధించిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఈ పుస్తకంలో తన జీవితానికి సంబంధించిన అనేక కీలక విషయాలను సోనియా గాంధీ వెల్లడించారు. ఆమె వ్యక్తి గత జీవితం, ప్రేమ, కుటుంబం, రాజకీయ ప్రయాణం, భారతదేశం తో అనుబంధం వంటి అనేక అంశాలు రాజకీయంగా చర్చనీ యాంశమయ్యాయి. తాజాగా అలాంటి మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలో అధికారాల విషయంలో ఎలాంటి గందరగోళం లేదని సోనియా గాంధీ వెల్లడిం చారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వా న్ని నడిపించగా, తాను కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించానని 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో పేర్కొన్నారు.



పదవిని వీడే ముందు

భారీగా క్షమాభిక్షలు

ట్రంప్ సంచలన ప్రకటన

- తన ప్రభుత్వంలోని వారిని రాజకీయ కక్షల నుంచి కాపాడటమే లక్ష్యమన్న ట్రంప్
- తనకు తాను క్షమాభిక్ష ఇచ్చుకునే ఆలోచన లేదని స్పష్టీకరణ
- రాజకీయ ప్రత్యర్థులను ఎప్పటికీ క్షమించలేనని తేల్చిచెప్పిన ట్రంప్

వాషింగ్టన్: తాను పదవి నుంచి వైదొలగడానికి ముందు భారీ సంఖ్యలో క్షమాభిక్షలు ప్రసాదిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. తన ప్రభుత్వంలో పనిచేసిన వారు భవిష్యత్తులో రాజకీయ కక్షసాధింపులకు గురికాకుండా కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఒక ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "అధికారం నుంచి దిగిపోయే ముందు మీరు పెద్ద ఎత్తున క్షమాభిక్షలు ఇస్తారా?"

2వ పేజీలో...



2వ పేజీలో...

డీఎస్పీల నియామకాల్లో..

పారదర్శకత పాటించాం

సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 10: భవిష్యత్తు నిర్ణయించే వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లితే నియామకాల పట్ల అపనమ్మకం ఏర్పడుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే టీజీపీఎస్సీ చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి బి. వెంకటేశంను నియమించామని తెలిపారు. ఈ ప్రాంత విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉన్న అధికారి చైర్మన్‌గా ఉంటే వారి భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు.



2వ పేజీలో...

మమతకు ఢిల్లీ పోలీసుల

నోటీసులు

2013 ఘటనపై వాంగ్మూలం కోరిన పోలీసులు

పశ్చిమబెంగాల్ : పశ్చిమబెంగాల్ మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. 2013లో పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌లో నమోదైన కేసుకు సంబంధించి విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని కోరుతూ.. ఈ నోటీసులు అందజేశారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) సెక్షన్ 160 కింద ఈ నోటీసులు జారీ చేసినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. విచారణాధికారిని ఎప్పుడు, ఎక్కడ కలవాలన్నది ఆమె సౌకర్యానుసారం నిర్ణయించుకోవచ్చని సూచించారు.



2వ పేజీలో...

- స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ రోజున ధర్నా చేసినందుకు నమోదైన కేసు
- జగన్, అవినాశ్ రెడ్డి సహా సుమారు 70 మందిపై కోడ్ ఉల్లంఘన ఆరోపణలు

అమరావతి, : వైసీపీ అధినేత జగన్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. పులివెందులలో తనపై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేయాలని (క్వాష్) కోరుతూ ఆయన న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ రోజున పులివెందుల మున్సిపల్ కార్యాలయం ఎదుట జగన్ నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ పోలింగ్ ఏజెంట్లను బూత్‌లలోకి అనుమతించకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలతో ఆయన అక్కడ ధర్నా చేపట్టారు.

కేసు కొట్టివేయాలని కోరుతూ..

హైకోర్టులో జగన్ పిటిషన్

పులివెందుల కేసును క్వాష్ చేయాలంటూ ఏపీ హైకోర్టులో జగన్ పిటిషన్

మోదీ బస్తర్ ప్రసంగంపై రాహుల్ వ్యాఖ్యలకు

బీజేపీ కౌంటర్..

- సాయుధ దళాలను గౌరవించడంలో కాంగ్రెస్, రాహుల్ వరుసగా విఫలమవుతున్నారన్న రాంచందర్ రావు
- నక్సల్స్ హింసను గానీ, పుల్వామా దాడిని గానీ ఖండించే ధైర్యం రాహుల్‌కు లేదని విమర్శ
- విదేశాలకు పారిపోకుండా పార్లమెంట్‌కు వచ్చి చర్చలో పాల్గొనాలని సూచన

హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పర్యటనలో ప్రధానమంత్రి మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, సైన్యాన్ని గౌరవించడంలో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ వరుసగా విఫలమవుతూనే ఉన్నారని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో మీడి యాతో మాట్లాడుతూ ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. బస్తర్ ప్రాంతంలో విధి నిర్వహణలో ఉన్న సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి వేడుకలు



పంచాయతీ ఎన్నికలకు..

మోగిన నగారా

- తిరుపతి జిల్లాలో 2 విడతల్లో పంచాయతీ పోరు
- తిరుపతిలో 777 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు.. షెడ్యూల్ విడుదల
- కోర్టు కేసులతో 30 గ్రామాల్లో ఎన్నికలకు బ్రేక్
- నవంబర్ 26, 29 తేదీల్లో తిరుపతి జిల్లా పంచాయతీ ఎన్నికలు

తిరుపతి : తిరుపతి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. జిల్లాలోని 35 మండలాల పరిధిలో ఉన్న 777 సర్పంచ్ స్థానాలు, 7,210 వార్డు సభ్యుల స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 807 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.



గర్వంగా ఉందన్న మంత్రి నారా లోకేశ్

ఐఓఏ కమిషన్ చైర్‌పర్సన్‌గా

పీవీ సింధు

- సింధుకు హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్
- రెండుసార్లు ఒలింపిక్ పతక విజేతగా ఒక తరానికి స్ఫూర్తిగా నిలిచారని ప్రశంస
- సింధును చూసి ఆంధ్రప్రదేశ్ గర్విస్తోందని ట్వీట్
- కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్ష

2వ పేజీలో...

సోనియా గాంధీ పుస్తకంపై బీజేపీ ఫైర్..

అది ఆత్మకథ కాదు 'వైట్‌వాషింగ్'



- సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్'పై బీజేపీ తీవ్ర విమర్శలు
- గాంధీ కుటుంబ చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చే ప్రయత్నమే ఈ పుస్తకమని ఆరోపణ
- ఎమర్జెన్సీని పొరపాటుగా చెప్పి దాన్ని సాధారణీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శ
- బాబ్రీపై ఏడ్చిన సోనియా.. సిక్కుల ఊచకోతపై ఎందుకు కన్నీరు పెట్టలేదని బీజేపీ ప్రశ్న
- నట్వర్ సింగ్ పుస్తకం విడుదలకు ముందు ఆయనను ఎందుకు కలిశారో చెప్పాలని డిమాండ్

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'పై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఈ పుస్తకం నెహ్రూ-గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చి, వారి పాపాలను శుభ్రపరిచే ఒక 'వైట్‌వాషింగ్' ప్రయత్నమని బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆరోపించారు. తాజాగా ఈ పుస్తకం విడుదలైన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటని, చివరికి ఆమె కూడా అదే అభిప్రాయానికి వచ్చారని సోనియా తన పుస్తకంలో పేర్కొన్నారు. ఆ సమయంలో ఇందిర తన చిన్న కుమారుడు సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే, జరిగిన నష్టంలో చాలా వరకు నివారించి ఉండేవారని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలను కేశవన్ తోసిపుచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలను అంగీకరించకుండా, దాన్ని ఒక సాధారణ పొరపాటుగా చిత్రీకరించి, సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పుస్తకంలో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటన గురించి ప్రస్తావిస్తూ తాను ఏడ్చానని సోనియా చెప్పడాన్ని కేశవన్ తప్పుబట్టారు. "బాబ్రీ మసీదు కోసం కన్నీళ్లు పెట్టుకున్న సోనియా గాంధీ, కాంగ్రెస్ హయాంలో 1984లో జరిగిన సిక్కుల ఊచకోతలో వేలాది మంది అమాయకులు చనిపోయినప్పుడు కనీసం ఒక్క కన్నీటి చుక్కైనా కార్చారా?" అని ఆయన ప్రశ్నించారు. 26/11 ముంబై ఉగ్రదాడులు, బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి గురించి ఎప్పుడైనా బాధపడ్డారా అని నిలదీశారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి నట్వర్ సింగ్ ఆత్మకథ విడుదలకు ముందు జరిగిన పరిణామాలను కూడా కేశవన్ గుర్తుచేశారు. "2014 లో నట్వర్ సింగ్ తన ఆత్మకథ 'వన్ లైఫ్ ఈజ్ నాట్ ఎనఫ్' విడుదలకు ముందు సోనియా గాంధీ ఆయన్ను ఎందుకు కలిశారు? 2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు జరిగిన పరిణామాల గురించి నట్వర్ సింగ్ ఏం రాస్తారోనన్న భయంతోనే ఆయన్ను కలిశారా? ఈ విషయాలపై తన పుస్తకంలో సోనియా స్పష్టత ఇస్తారా?" అని కేశవన్ ప్రశ్నల వర్షం కురిపించారు. దాదాపు 55 ఏళ్ల కాంగ్రెస్ పాలన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని నష్టం కలిగించిందని, ప్రధాని నరేంద్ర మోదీ ఆ చారిత్రక తప్పిదాలను సరిదిద్దుతున్నారని ఆయన పేర్కొన్నారు.

యూపీఏ ప్రభుత్వంలో జోక్యం చేసుకోలేదు



మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వ వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకున్నానని, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ప్రభుత్వ ఫైళ్లను తెప్పించుకున్నానని గతంలో వచ్చిన ఆరోపణలను ఆమె ఖండించారు. అవన్నీ పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వం ఏర్పాటు సమయంలో తాను కొన్ని సూచనలు ఇచ్చినట్లు అంగీకరించారు. అధికారంలో లేని సమయంలో పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నేతలకు తగిన గుర్తింపు కల్పించాలన్నదే తన ఉద్దేశమని సోనియా వివరించారు. మరోవైపు, 2004 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే తాను ప్రధానమంత్రి పదవిని చేపట్టకూడదని నిర్ణయించుకున్నట్లు సోనియా గాంధీ తెలిపారు. ఈ నిర్ణయంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కూడా కీలక పాత్ర పోషించారని, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో ప్రధాని పదవిని స్వీకరించవద్దని వారు సూచించారని తెలిపారు. 1991 ఆర్థిక సంస్కరణలకు నాయకత్వం వహించిన మన్మోహన్ సింగ్ అనుభవం యూపీఏ ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని భావించి ఆయనను ప్రధానిగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, 2010లో ప్రధానమంత్రి మార్పు అంశాన్ని ప్రణబ్ ముఖర్జీ ప్రస్తావించారని, ఆయనకు ప్రధానమంత్రి కావాలనే ఆకాంక్ష ఉందని తాను అర్థం చేసుకున్నానని సోనియా తన పుస్తకంలో వెల్లడించారు. కాగా, యూపీఏ పదేళ్ల పాలనలో తన పాత్రపై వచ్చిన విమర్శలకు ఈ పుస్తకం ద్వారా సోనియా స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు.

కారేపల్లి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన

వి. రమేష్‌కు కాంగ్రెస్ నేతల స్వాగతం!

మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సంపూర్ణ సహకారం అందిస్తాం: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు

కారేపల్లి, నవంబర్ 10: కారేపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వి. రమేష్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన ఎస్ఐకు స్వాగతం పలుకుతూ అభినందనలు తెలియజేశారు.అనంతరం తోటకూరి రాంబాబు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, నేరాల నియంత్రణ విషయంలో పోలీసు శాఖకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎల్లప్పుడూ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీసు శాఖతో సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు



గుగులోత్ భీముడు నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బోళ్ల రమేష్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు కడియాల సుధాకర్, పార్టీ మండల సమన్వయకర్త వాంకుడోత్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కేసు కొట్టివేయాలని కోరుతూ..

హైకోర్టులో జగన్ పిటిషన్

మొదటిపేజీ తరువాయి...

అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లో ఉన్న సమయంలో అనుమతి లేకుండా ఆందోళన నిర్వహించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో జగన్‌తో పాటు కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, సుమారు 70 మందిపై నిబంధనల ఉల్లంఘన కింద అభియోగాలు మోపారు. రాజకీయ కారణాలతోనే ఈ కేసు నమోదు చేశారని, అందువల్ల దీనిని కొట్టివేయాలని జగన్ తన పిటిషన్‌లో కోరారు.మరోవైపు, వైసీపీకి చెందిన పలువురు ఎమ్మెల్సీలు కూడా హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యాలయం వద్ద నిరసన తెలిపినందుకు గాను ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మురుగుడు హనుమంతరావు, రుహుల్లాలపై సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తమపై పెట్టిన కేసును కూడా కొట్టివేయాలని వారు కోర్టును అభ్యర్థించారు. జగన్ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్సీల పిటిషన్లపై ఏపీ హైకోర్టు విచారణ చేపట్టనుంది.

ఉద్యోగి 48 గంటలు కస్టడీలో ఉంటే సస్పెన్షన్ అయినట్లే

మొదటిపేజీ తరువాయి...

ఒక కాంట్రాక్టర్‌కు సంబంధించిన రూ. 36,421 వేతన బకాయిలను క్లియర్ చేసేందుకు రూ. 4,000 లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఆయన అవినీతి నిరోధక చట్టం కింద అరెస్టయ్యారు. అరెస్టు అనంతరం ఆయన దాదాపు 15 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో సెషన్స్ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేయగా, పాట్నా హైకోర్టు ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ధర్మాసనం బెయిల్‌ను పునరుద్ధరించింది. అయితే, విచారణ క్రమంలో నిందితుడి సస్పెన్షన్‌ను రద్దు చేసి, తిరిగి అదే ఆసుపత్రిలో, అదే పోస్టులో నియమించడంపై ధర్మాసనం తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేసింది. "ఇది షాక్‌కు గురిచేస్తోంది. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమీక్షించాలి" అని న్యాయస్థానం ఆదేశించింది. తీవ్రమైన నేరచరిత్ర లేని పక్షంలో ఇటువంటి కేసుల్లో సాధారణంగా బెయిల్ మంజూరు చేయాలని పేర్కొన్న సుప్రీంకోర్టు, పాట్నా హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేసి, సెషన్స్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను పునరుద్ధరించింది.

మోదీ బస్తర్ ప్రసంగంపై రాహుల్ వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్..

మొదటిపేజీ తరువాయి...

జరుపుకుని వారిలో నైతిక స్థైర్యాన్ని నింపారని రాంచందర్ రావు పేర్కొన్నారు. అయితే గతంలో బస్తర్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులైనప్పుడు ఆ ఘటనలను కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ఖండించలేదని దుయ్యబట్టారు. బస్తర్‌లో నక్సలైట్ల హింసను గానీ, పుల్వామాలో జవాన్ల వీరమరణాన్ని గానీ, ఉగ్రవాద దాడులను గానీ ఖండించే ధైర్యం రాహుల్ గాంధీకి ఎన్నడూ లేదని, కనీసం బాధితులకు సానుభూతి కూడా తెలపలేదని ఆరోపించారు. ఇటీవల బస్తర్ పర్యటనలో మోదీ మాట్లాడుతూ... ఆయుధాలు పట్టిన నక్సలిజం అంతమవుతున్నప్పటికీ, వివిధ సంస్థల్లో చొరబడిన "మేధో నక్సల్స్" రూపంలో ఇంకా ముప్పు పొంచి ఉందని వ్యాఖ్యానించారు. దీనిపై రాహుల్ గాంధీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ... విపక్షాలను ప్రధాని నక్సల్స్‌గా ముద్రవేస్తున్నారని ఆరోపిస్తూ, దేశద్రోహి ఎవరో చర్చించేందుకు రావాలని బహిరంగ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై రామచందర్ రావు స్పందిస్తూ... రాహుల్ గాంధీ వియత్నాం, రష్యా, అమెరికా వంటి దేశాలకు పారిపోకుండా, నేరుగా పార్లమెంట్‌కు వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా చర్చలో పాల్గొనాలని హితవు పలికారు.

పదవిని వీడే ముందు భారీగా క్షమాభిక్షలు

మొదటిపేజీ తరువాయి...

అని అడగ్గా.. "అవును, కచ్చితంగా ఇస్తాను. భారీ సంఖ్యలో క్షమాభిక్షలు మంజూరు చేయాలని భావిస్తున్నాను" అని ట్రంప్ సమాధానమిచ్చారు. తన హయాంలో పనిచేసిన అధికారులు, సిబ్బంది తమ జీవితాంతం రాజకీయ ప్రత్యర్థులతో న్యాయపోరాటాలు చేయాల్సిన అవసరం లేకుండా చూడటమే తన ఉద్దేశమని వివరించారు. అయితే, తనకు తాను క్షమాభిక్ష ఇచ్చుకునే అధికారం ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆ ఆలోచన లేదని ట్రంప్ తేల్చి చెప్పారు.

జనవరి 6న క్యాపిటల్ భవనంపై జరిగిన దాడికి సంబంధించి గతంలో ఇచ్చిన క్షమాభిక్షలను ట్రంప్ సమర్థించుకున్నారు. ఆ ఘటనలో నిందితుల పట్ల అన్యాయంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. ఇదే సమయంలో, తన రాజకీయ ప్రత్యర్థులైన జేమ్స్ కోమీ, నాన్సీ పెలోసీ వంటి వారిని ఎప్పటికీ క్షమించలేనని స్పష్టం చేశారు. "కొంతమంది శత్రువులను నేను ద్వేషిస్తాను, ఎప్పటికీ ద్వేషిస్తూనే ఉంటాను" అని ఆయన వ్యాఖ్యానించారు. తన అధ్యక్ష పదవీ కాలాన్ని ప్రజలు ఎలా గుర్తుంచుకోవాలని కోరుకుంటున్నారని అడగ్గా.. "నేను అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా నిలబెట్టానని ప్రజలు గుర్తుంచుకోవాలి" అని ట్రంప్ సమాధానమిచ్చారు.

డీఎస్పీల నియామకాల్లో..

పారదర్శకత పాటించాం

మొదటిపేజీ తరువాయి...

మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్లిష్టమైన పరిస్థితుల్లో డీఎస్పీల నియామకం చేపట్టామని వివరించారు. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు ఈ ప్రభుత్వమే పూర్తి చేసిందని పేర్కొన్నారు. 2011లో గ్రూప్-1 నియామకాలు చేపట్టారని.. ఆ తర్వాత 2025 వరకు దాదాపు 13 ఏళ్లు తెలంగాణలో గ్రూప్-1 నియామకాలు చేపట్టలేదని గుర్తు చేశారు. కొన్ని నెలలు ఆలస్యమైతేనే ఏళ్ల కోల్పోయామనే బాధ కలుగుతుందని అన్నారు. టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చినా.. ప్రశ్నాపత్రాలు, ఇతర అంశాల్లో జరిగిన గందరగోళం అందరికీ తెలుసునని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మీరు ఆ రోజు బాధితులు.. ఆనాటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, నిర్లక్ష్యం చాలా మందికి కష్టనష్టాలు మిగిల్చిందని తెలిపారు. తాను ముఖ్యమంత్రి కాగానే టీజీపీఎస్సీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించానని గుర్తు చేసుకున్నారు. గతంలో టీజీపీఎస్సీలో సభ్యులుగా పనిచేసిన వారిలో ఆర్ఎంపీ డాక్టర్లు లాంటి వాళ్లు కూడా ఉన్నారని వివరించారు. రాజకీయ పునరావాస కేంద్రంగా టీజీపీఎస్సీ తయారైందని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అవగాహన లేని వాళ్లను సభ్యులుగా నియమించడమే ప్రభుత్వం చేసిన తప్పు అని పేర్కొన్నారు. యూపీఎస్సీ చేపట్టిన విధి విధానాలను అధ్యయనం చేసి టీజీపీఎస్సీని ఆ తరహాలో రూపొందించామని అన్నారు. అందుకోసం యూపీఎస్సీకి స్వయంగా వెళ్లి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. టీజీపీఎస్సీ మొదటి చైర్మన్‌గా రిటైర్డ్ డీజీపీ మహేందర్ రెడ్డిని నియమించామని వివరించారు. పోటీ పరీక్షలు నిర్వహించడంలో అనుభవం కలిగిన వాళ్లను, చిత్తశుద్ధి ఉన్నవాళ్లను బోర్డు సభ్యులుగా నియమించామని సోదాహరణగా వివరించారు. 563 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 562 మంది జాయిన్ అయ్యారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 112 మంది డీఎస్పీల నియామకం చాలా పెద్ద విషయమని అన్నారు. నియామకాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో పారదర్శకత పాటించిందని చెప్పారు.

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారి పిల్లలు కూడా ఈ నియామకాల్లో ఉన్నారంటే తమ ప్రభుత్వ పారదర్శకత అర్థమవుతుందని తెలిపారు. ఈ నియామకాలపై కొందరు పని గట్టుకుని ఎన్నో ఆరోపణలు చేశారని మండిపడ్డారు. అయితే తమకు రాజకీయ ఆరోపణలు కొత్త కాదని.. కానీ మీకు ఇది చాలా ఆందోళన కలిగించిందని చెప్పారు. ఈ అవకాశం కూడా జారిపోతుందేమోనని ఆందోళన చెందారని అన్నారు. డీఎస్పీల తరఫున సుప్రీంకోర్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లిందని వివరించారు. నిష్ణాతులైన న్యాయవాదులతో వాదించి డీఎస్పీల నియామకాన్ని సాధించామని గుర్తు చేశారు. నాలెడ్జ్, చిత్తశుద్ధి, అంకితభావం మీ అందరినీ ఇక్కడ కూర్చోబెట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

వ్యక్తిగత దూషణలు కాదు.. ఇచ్చిన హామీలు నెరవేర్చు' - బీఆర్ఎస్ వైరా నాయకుడు లకావత్ గిరిబాబు

జూలూరుపాడు, నవంబర్ 10 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూపురేఖలపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం రాజకీయ అసహనానికి నిదర్శనమని ఆ పార్టీ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు అన్నారు. ?రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం గురించి మాట్లాడాల్సిన ముఖ్యమంత్రి.. అందుకు భిన్నంగా వ్యక్తిగత దూషణలకు దిగడం ఆయన బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు ఉండాలే తప్ప, ఇలాంటి వ్యక్తిగత దాడులకు తావులేదన్నారు. కేటీఆర్‌ను రాజకీయంగా, సైద్ధాంతికంగా ఎదుర్కోలేకనే రేవంత్ రెడ్డి ఇలాంటి దివాలాకోరు రాజకీయాలకు తెరతీశాడని విమర్శించారు.

హామీల అమలు ఏదీ?: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని గిరిబాబు దుయ్యబట్టారు. రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగులకు కొలువులు, మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. పాలనాపరమైన తమ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి ఉద్దేశపూర్వకంగా ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పీఠంపై ఉన్న వ్యక్తి నుండి ప్రజలు ఆశించేది చౌకబారు విమర్శలు కాదని, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం, ఇచ్చిన హామీల అమలు అని ఆయన అన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి వ్యక్తిగత దూషణలు కట్టిపెట్టి, రాష్ట్ర ప్రగతిపై, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

ఐఓఏ కమిషన్ చైర్‌పర్సన్‌గా పీవీ సింధు

మొదటిపేజీ తరువాయి...

అమరావతి, :ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, తెలుగు తేజం పీవీ సింధుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు ఎన్నికైన సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "రెండు పర్యాయాలు ఒలింపిక్ పతకాలు సాధించి, బ్యాడ్మింటన్ కోర్టులో నవతరానికి స్ఫూర్తిగా నిలిచిన పీవీ సింధు.. ఇప్పుడు భారత క్రీడారంగంలో కీలక నాయకత్వ బాధ్యతలను చేపట్టడం గర్వకారణం. సింధూ, మీ విజయాలను చూసి ఆంధ్రప్రదేశ్ గర్విస్తోంది" అని లోకేశ్ తన సందేశంలో కొనియాడారు. క్రీడాకారిణిగా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఆమె, ఇప్పుడు క్రీడా పరిపాలనలోనూ విజయవంతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కీలక బాధ్యతల్లో సింధు ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. సింధు ఈ నూతన పదవిని చేపట్టడం భారత క్రీడారంగానికి శుభపరిణామమని పలువురు క్రీడాభిమానులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలకు మోగిన నగారా

మొదటిపేజీ తరువాయి...



అయితే వివిధ కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల 30 పంచాయతీల్లో ప్రస్తుతానికి ఎన్నికలు నిర్వహించడం లేదని అధికారులు స్పష్టం చేశారు. మిగిలిన 777 పంచాయతీలకు పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 195 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం.. మొదటి విడతలో భాగంగా 18 మండలాల్లోని 415 పంచాయతీలకు పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి నవంబర్ 15న ఎన్నికల నోటీసు జారీ కానుండగా, నవంబర్ 17 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. వీటికి నవంబర్ 26న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇక రెండో విడతలో మిగిలిన 17 మండలాల్లోని 362 పంచాయతీలకు నవంబర్ 29న పోలింగ్ జరగనుంది. ఆయా పోలింగ్ తేదీల్లోనే సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి, వెంటనే ఫలితాలను ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా యంత్రాంగం పేర్కొంది.

మమతకు ఢిల్లీ పోలీసుల నోటీసులు

మొదటిపేజీ తరువాయి...

అసలేం జరిగిందంటే?: 2013లో ఢిల్లీలోని నాటి ప్రణాళికా సంఘం కార్యాలయం సమీపంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఆ సమయంలో మమత తన పార్టీ నేతలు, మంత్రులతో కలిసి అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఆమె బృందాన్ని చుట్టుముట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. అప్పటి బెంగాల్ ఆర్థిక మంత్రి అమిత్ మిత్రాపై దాడి చేసి, దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు రాగా.. ఈ ఘటనపై పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, ఉద్యోగులపై దాడి చేయడం, అల్లర్లు సృష్టించడం వంటి అభియోగాలతో ఐపీసీ సెక్షన్లు 186, 353, 332, 147, 149, 34 కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో నాటి ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి రితబ్రత బెనర్జీని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే.. ఈ కేసులో మమత పాత్రపై మరిన్ని వివరాలు సేకరించేందుకు పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేయాలని భావిస్తున్నారు. కేసుకు సంబంధించిన పరిస్థితులపై ఆమెకు అవగాహన ఉందని, అందుకే సాక్షిగా విచారణకు సహకరించాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే ఈ నోటీసులపై మమత లేదా టీఎంసీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

సంపాదకీయం

ప్రహసనంగా ప్రజాస్వామ్యం..

రాష్ట్రంలో జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ఆధిక్యం సాధించింది. కానీ, ఈ విజయాల వెనుక ఎన్నికల ప్రక్రియలో అడుగడుగునా పాలక కూటమి అనుసరించిన నిరంకుశ పద్ధతులను ప్రజాస్వామ్య వాదులు నిరసిస్తున్నారు. నామినేషన్ల దశ నుంచే ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను అడ్డుకోవడం, దాడులు చేయడం, బెదిరించడం, నామినేషన్ పత్రాలను చింపివేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. అధికారిక సమాచారం ప్రకారం మున్సిపల్ ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా 261 కేసులు నమోదయ్యాయి. పరిషత్ ఎన్నికలలో నామినేషన్ల సందర్భంగా 13 జిల్లాల్లో 31 కేసులు నమోదయ్యాయి. పరిషత్ ఎన్నికల కేసులకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు రావాల్సిఉంది. పోలీసులు నమోదు చేసిన వాటిలో కొన్ని అధికారపక్షం బనాయించినవి కాగా, మిగిలినవి బెదిరింపులు, దౌర్జన్యాలు అధిగమించి స్టేషన్లదాకా వచ్చినవి! పోలీస్ స్టేషన్ దాకా రాలేని వారు, రాని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. పోలింగ్ సమయంలోనూ ప్రతిపక్ష ఏజెంట్లను కేంద్రాల నుంచి బయటకు పంపడం, దాడులు, రిగ్గింగ్ వంటి ఆరోపణలతోపాటు కౌంటింగ్ సమయంలోనూ ఈ తరహా అక్రమాలకు పాల్పడ్డారంటూ వార్తలు రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఎన్నికల్లో గెలవడం ఒక ఎత్తయితే, ప్రత్యర్థులకు స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం కల్పించడం మరో ఎత్తు. రాష్ట్రంలో అటువంటి వాతావరణంలో ఎన్నికలు జరగలేదన్నది జనవాక్యం!

పోలీస్ యంత్రాంగంతో పాటు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ వ్యవహార తీరు కూడా ఈ ఎన్నికల్లో ప్రశ్నార్థకంగా మారింది. అక్టోబరు 21న సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, నామినేషన్లు దాఖలు చేయలేకపోయిన అభ్యర్థుల ఫిర్యాదులు, ఆధారాలను పరిశీలించి అవసరమైన చోట్ల గడువు పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు అక్టోబరు 22న నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో నామినేషన్ల గడువును 48 గంటలు పొడిగించారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఆదేశాల తరువాత జరిగిన పరిషత్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగానూ అధికార కూటమి అక్రమాలు ఏ మాత్రం ఆగక పోవడం బరితెగింపునకు నిదర్శనం. నిజానికి ఎన్నికల సంఘం స్వతంత్రంగా, పారదర్శకంగా వ్యవహరించి ప్రతి ఫిర్యాదుపై నిష్పాక్షిక విచారణ జరపాల్సి ఉంది. అక్రమాలకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి, తప్పు చేసినవారు ఏ పార్టీకి చెందినవారైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిజమని తేలిన చోట నిబంధనల ప్రకారం రీపోలింగ్ నిర్వహించాలి. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టడం ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం బాధ్యత. అలా వ్యవహరించకుండా అత్యధిక చోట్ల పోలీసులు అధికార కూటమి కనుసన్నల్లో పనిచేశారన్నది జగద్విదితం. కొన్నిచోట్ల రిటర్నింగ్ ఆఫీసర్ల కస్టడీలో ఉన్న నామినేషన్ పత్రాలు, బి-ఫారాలు సైతం చించివేశారన్న ఆరోపణలు సత్యదూరం కాదు. ప్రభుత్వ అధికారులు, పోలీస్ యంత్రాంగం ప్రజలకు, ప్రజాస్వామ్యానికి విధేయులుగా వుండాలి తప్ప అధికారంలోని పార్టీకి సేవ చేయడానికి కాదు. అధికారపార్టీ ఒత్తిళ్ల మధ్య చట్ట ప్రకారం, నిజాయితీగా వ్యవహరించడం చిన్న ఉద్యోగులకి కొంత కష్టం కావచ్చు. కానీ, ఉన్నత స్థాయి అధికారులు సైతం ప్రలోభాలాకో, ఒత్తిళ్లకో తలొంచితే ఎలా? చిత్తశుద్ధితో, నిజాయితీగా పనిచేశామా లేదా అన్నది వారు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ ఎన్నికలలో తాము బాధితులమని ఒక వైపు చెబుతూనే మరోవైపు తాము అధికారంలోకి వస్తే ఇదే తరహాలోనో, ఇంతకు రెండింతలుగానో వ్యవహరిస్తామని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంకేతాలు ఇవ్వడం ఏ మాత్రం సరికాదు. ప్రస్తుత ఎన్నికలు జరిగిన తీరును బీహార్‌తో పోలుస్తూ తాము అధికారంలోకి వస్తే దానినే కొనసాగిస్తామని చెప్పడంలో అర్థం ఏమిటి? రాష్ట్రాన్ని రావణకాష్ఠంలా రగిలించడంలో పోటీ పడితే ఇక అభివృద్ధి ఎక్కడ? ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు నిర్వహించడం, మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం మాత్రమే కాదు. ప్రతిపక్షానికి పోటీ చేసే హక్కు, ప్రచారం చేసుకునే హక్కు, ప్రజలకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించాలి. ప్రజాస్వామ్యంలో ఇవి అంతర్భాగాలు. అధికార బలాన్ని, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ప్రతిపక్షం గొంతు నొక్కడం, దానికి ప్రాతినిధ్యం లేకుండా చేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదు. స్థానిక సంస్థలు గ్రామీణ, పట్టణ ప్రజల సమస్యలను ప్రతిబింబించాలి. అది జరగాలంటే, ప్రతిపక్షం గొంతు వినిపించాలి. దీనికి భిన్నంగా అన్నీ అధికార కూటమికే దక్కాలన్న వైఖరి ఏ మాత్రం వాంఛనీయం కాదు. అధికార కూటమి ఎంత భయానక పరిస్థితులను సృష్టించినా, ఏమాత్రం భయపడకుండా గణనీయమైన స్థానాల్లో ప్రతిపక్షాన్ని ప్రజలు గెలిపించారు. డబ్బు, మద్యం వంటి అనేక అక్రమాలను తిరస్కరించి పరిమిత స్థానాల్లోనైనా వామపక్షాల అభ్యర్థులను ఎన్నుకోవడం అభినందనీయం. ఎన్నికల అక్రమాలను ప్రశ్నించడం, బాధితులకు అండగా నిలవడం, అధికార దుర్వినియోగాన్ని వ్యతిరేకించడం ప్రతి ఒక్కరి బాధ్యత! ఆ దిశలో ప్రజలను చైతన్య పరచాలి.

తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త..

వైద్యశాఖలో 2,929 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం



- వైద్యారోగ్య శాఖలో 2,929 పోస్టుల భర్తీకి సన్నాహాలు
- 996 పోస్టులకు ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం
- మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నియామకాల ప్రక్రియ
- ప్రస్తుతం కొనసాగుతున్న 2,711 పోస్టుల భర్తీ చివరి దశలో
- ఇప్పటికే 13,401 పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్: తెలంగాణ వైద్యారోగ్య శాఖలో మరో భారీ నియామక ప్రక్రియకు రంగం సిద్ధమవుతోంది. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 2,929 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వీటిలో 996 పోస్టులకు ఆర్థిక శాఖ ఇప్పటికే అనుమతి ఇవ్వగా, మరో 1,933 పోస్టులకు ఆమోదం లభించాల్సి ఉంది. త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడే అవకాశం ఉంది. ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన 996 పోస్టుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (198), ఆయుష్ ఫార్మసిస్ట్ గ్రేడ్-2 (308), టెక్నీషియన్ (290) వంటి కీలకమైన పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు బయోమెడికల్ ఇంజనీర్లు, ఫిజియోథెరపిస్టులు, రేడియోగ్రాఫర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎం పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు.

ఈ నియామకాలను తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ), ఆయుష్, ఎంఎన్‌జే వంటి పలు విభాగాల్లో చేపట్టనున్నారు. ప్రభుత్వం అనుమతి కోసం ఎదురుచూస్తున్న 1,933 పోస్టుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ (716), సివిల్ అసిస్టెంట్ సర్జన్ (మొత్తం 422), స్టాఫ్ నర్సు (194), ల్యాబ్ టెక్నీషియన్ (96) వంటి ముఖ్యమైన ఖాళీలు ఉన్నాయి. వీటికి కూడా ఆర్థిక శాఖ నుంచి ఆమోదం రాగానే నోటిఫికేషన్లు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నియామక ప్రక్రియను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంఆర్‌బీ) ద్వారా వేగవంతం చేయనుండగా, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను మాత్రం టీఎస్‌పీఎస్సీ భర్తీ చేయనుంది. కాగా, ప్రస్తుతం ఎంఆర్‌బీ ఆధ్వర్యంలో 2,711 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో 1,931 ఎంపీహెచ్ఏ (మహిళ) పోస్టుల నియామకాలు దాదాపు పూర్తికాగా, త్వరలో తుది జాబితా రానుంది. మరోవైపు, 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు 4 వేలకు పైగా దరఖాస్తులు రావడంతో, వాటి పరిశీలనకు సమయం పడుతోందని అధికారులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యశాఖలో ఇప్పటివరకు 13,401 పోస్టులను భర్తీ చేయడం గమనార్హం.

ప్రియుడితో కలిసి భర్తను అంతమొందించిన భార్య

- గుండెపోటుగా చిత్రీకరించి తప్పించుకునేందుకు విఫలయత్నం
- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని దారుణం
- పోస్టుమార్టం నివేదికతో వెలుగులోకి అసలు నిజం
- భార్య, ఆమె ప్రియుడిని అరెస్ట్ చేసిన బెంగళూరు పోలీసులు



బెంగళూరు: బెంగళూరులో ఓ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న కారణంతో ప్రియుడితో కలిసి భర్తను హతమార్చి, దానిని గుండెపోటుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన భార్యను, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎలక్ట్రానిక్ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొడ్డతొగురులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉపేంద్ర (41), అనిత (36) దంపతులు. అనితకు వారి స్వగ్రామానికే చెందిన మధుసూదన్ రెడ్డి (46)తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఉపేంద్ర వారిద్దరినీ తీవ్రంగా హెచ్చరించాడు. దీంతో తమ బంధానికి అడ్డుగా ఉన్న ఉపేంద్రను అంతమొందించాలని అనిత, మధుసూదన్ నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం, అక్టోబర్ 12వ తేదీ తెల్లవారుజామున ఉపేంద్రను ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం అతను బాత్రూమ్‌కు వెళ్తూ జారిపడి, గుండెపోటుతో మరణించాడని అందరినీ నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే, ఉపేంద్ర సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు దీనిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక రావడంతో ఈ కేసు కీలక మలుపు తిరిగింది. నివేదిక ఆధారంగా అనుమానం వచ్చిన పోలీసులు, ఈ నెల 5న మధుసూదన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతను నేరాన్ని అంగీకరించాడు. అతని సమాచారంతో మరుసటి రోజు అనితను కూడా అరెస్ట్ చేయగా, ఆమె సైతం నిజాన్ని ఒప్పుకుంది. దీంతో ఈ కేసును హత్య కేసుగా మార్చిన పోలీసులు, నిందితులిద్దరినీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

తాడిపత్రిలో మళ్లీ రాజుకున్న రాజకీయం..

ప్రత్యర్థులకు జేసీ ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీల సవాల్!

అనంతపురంలో రాజకీయ దుమారం రేపిన జేసీ ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీలు
2021 నాటి స్థానిక ఎన్నికల ఫలితాలతో పోలుస్తూ వైసీపీ నేతలకు సూటి ప్రశ్నలు
జగన్ తన తండ్రి వైఎస్సార్ పేరును చెడగొట్టారన్న జేసీ ప్రభాకర్ రెడ్డి
కుప్పంలో తమిళనాడు నుంచి దొంగ ఓటర్లను తెచ్చి గెలిచారని తీవ్ర ఆరోపణలు
నగర అభివృద్ధి కోసం అనంతపురం మేయర్ పార్టీ మారాలని సూచన



అనంతపురం: అనంతపురం జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. 2021లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలను, ప్రస్తుత తాజా ఫలితాలతో పోలుస్తూ ఆయన ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు స్థానికంగా పెను చర్చకు దారితీశాయి. ప్రత్యర్థి పార్టీ వైఖరిని ఎండగడుతూ జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ ఫ్లెక్సీల ద్వారా నేరుగా ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ ఫ్లెక్సీలలో వైసీపీ నేతలను ఉద్దేశించి తీవ్రస్థాయిలో సెటైర్లు వేశారు. "2021లో మీకు కళ్లు దొబ్బాయా?" అంటూ ఘాటైన వ్యాఖ్యలను ఫ్లెక్సీలపై ప్రదర్శించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌లను లక్ష్యంగా చేసుకుంటూ.. "మీకు కళ్లు, చెవులు పనిచేస్తే ఈ ఫలితాలను చూడండి" అంటూ ఫ్లెక్సీల ద్వారా నిలదీశారు. గత ప్రభుత్వంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తీరును, ఇప్పటి ఫలితాలను ప్రజల ముందు ఉంచేందుకే ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. జగన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు ప్రతిష్ఠలను పూర్తిగా చెడగొట్టారని ఆయన మండిపడ్డారు. తాను జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయాలను శాశ్వతంగా రూపుమాపాలని గట్టిగా కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిందని జేసీ ఆరోపించారు. కుప్పం పురపాలక ఎన్నికల్లో తమిళనాడు నుంచి బస్సుల్లో దొంగ ఓటర్లను తరలించి మరీ వైసీపీ అక్రమంగా గెలిచిందని దుయ్యబట్టారు. అలా దొంగ ఓట్లతో గెలిచిన వైసీపీ నేతలకు ప్రస్తుతం ప్రజాస్వామ్యం, విలువల గురించి మాట్లాడే కనీస నైతిక అర్హత లేదని ఆయన కొట్టిపారేశారు. అనంతపురం జిల్లాకు చెందిన పలువురు కీలక వైసీపీ నేతలపై కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి విరుచుకుపడ్డారు. మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిల తీరును తప్పుబట్టారు. అనంతపురం జిల్లా ప్రగతి పథంలో సాగాలంటే వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి అనంత వెంకట్రామిరెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, నైతికత ఉంటే వైసీపీ తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులందరూ ముందుగా తమ పదవులను వదులుకోవాలని సవాల్ విసిరారు. మరోవైపు, అనంతపురం నగర సమగ్ర అభివృద్ధి జరగాలంటే, కొత్తగా మేయర్‌గా గెలిచిన రమేశ్‌గౌడ్ పార్టీ మారితే మంచిదని జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ఎదురెదురుగా బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

కారేపల్లి, నవంబర్ 10 : కారేపల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం గాదెపాడు గ్రామానికి చెందిన మొక్కపాటి రాంప్రసాద్ ఖమ్మం నుండి వస్తుండగా, గిద్దవారిగూడెంకు చెందిన మైనర్లు కన్నెబోయిన గణేష్, గోసి విజయ్ మరో ద్విచక్ర వాహనంపై ఖమ్మం వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాంప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా, ఇద్దరు మైనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద ఛాటికి రెండు వాహనాల ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మైనర్లు లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ ప్రమాదానికి కారణమయ్యారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడంపై కూడా పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.



అదుపుతప్పి బైకును ఢీకొట్టిన కారు.. రెండు వాహనాలు ధ్వంసం



జోగులాంబ గద్వాల జిల్లా :జోగులాంబ గద్వాల జిల్లా కుర్వపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన ఓ కారు రోడ్డు పక్కన నిలిపి ఉంచిన బైకును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు, బైకు రెండూ తీవ్రంగా ధ్వంసమయ్యాయి. కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో బైకు పూర్తిగా దెబ్బతింది. కారుకు కూడా భారీగా నష్టం వాటిల్లింది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

దోమల భరతం పట్టే ఏఐ డ్రోన్లు..

గుజరాత్ కుర్రాళ్ల ఆవిష్కరణకు గేట్స్ ఫౌండేషన్ ఫిదా!



మెహసానా: గుజరాత్‌లోని మెహసానాకు చెందిన ఇద్దరు యువకులు దోమల సంతానోత్పత్తి కేంద్రాలను గుర్తించే ఏఐ ఆధారిత డ్రోన్లను అభివృద్ధి చేశారు. ప్రైమ్ యూఏవీ సంస్థ రూపొందించిన ఈ డ్రోన్లు మురుగు నీరు, ఎత్తైన భవనాలు, పై కప్పులు, మనుషులు చేరుకోలేని ప్రాంతాల్లో దోమల ఆవాసాలను క్షణాల్లో గుర్తిస్తాయి. ఈ సమాచారాన్ని అధికారులకు లైవ్‌లో పంపడంతోపాటు అవసరమైన చోట పురుగుల మందు పిచికారీ చేస్తాయి. సంస్థ వ్యవస్థాపకుడు ప్రదీప్ పటేల్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. 2021లో పరిశోధనలు ప్రారంభించిన సంస్థ గాంధీనగర్ పరిధిలో 3,500కు పైగా దోమల స్థావరాలను గుర్తించింది. బిల్ అండ్ లిండా గేట్స్ ఫౌండేషన్ బృందం ఈ టెక్నాలజీని పరిశీలించింది. కరోనా సమయంలో పోలీసు, ఆరోగ్య శాఖలకు డ్రోన్లతో సహకరించిన సంస్థ అడవుల్లో సీడ్ బాల్స్ చల్లడం వంటి కార్యక్రమాలను కూడా చేపట్టింది.

ఏసీబీ వలలో భైంసా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్..



కరీంనగర్ : లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని ఏసీబీ ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారుల తీరు మారడం లేదు.. బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు ఫైల్స్ కదలాలంటే లంచం ఇవ్వాల్సిందేనంటూ ఎక్కడో ఒక చోట టేబుల్ కింద చేతులు పెడుతూ అడ్డంగా బుక్కవుతున్నారు. తాజాగా భైంసా మున్సిపాలిటీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న జాదవ్ సంతోష్ ఓ సివిల్ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. సదరు సివిల్ కాంట్రాక్టర్ పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న చెక్కులను విడుదల చేసేందుకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జాదవ్ సంతోష్ రూ.60 వేలు డిమాండ్ చేశాడు. తొలి దఫా రూ.10 వేలు లంచం తీసుకుని 6 లక్షలకు పైగా చెక్‌ను విడుదల చేశారు. అయితే రెండో విడతలో రూ.2 లక్షలకుపైగా చెక్ ఇచ్చేందుకు ఫిర్యాదు దారుడి నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలోని అధికారుల బృందం రెండ్‌హ్యాండెడ్‌గా జాదవ్ సంతోష్‌ను పట్టుకున్నారు. నిందితుడిని కరీంనగర్ స్పెషల్ జడ్జి (ఏసీబీ కేసులు) ముందు హాజరు పరిచి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించనున్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి తల్లిపాలే తొలి పౌష్టికాహారం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ : చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే అత్యంత ముఖ్యమైన పౌష్టికాహారమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. జాతీయ పోషణ మాసం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెట్టుగడ్డలోని స్టేట్ హోంలో 'మన అంగన్వాడీ-మన బాధ్యత' థీమ్‌తో నిర్వహించిన ఆరోగ్య లక్ష్మి అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శిశువు పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలను అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయని తెలిపారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారం అందించి, రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు.

వనపర్తి జిల్లాలో 900 ఏళ్ల నాటి శాసనం



- వనపర్తి జిల్లా కోటకొండలో 12వ శతాబ్దపు శాసనం గుర్తింపు
- కల్యాణి చాళుక్య చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుడి కాలం నాటిదిగా నిర్ధారణ
- భూదానాల వివరాలను వెల్లడించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం
- తెలుగన్నడ లిపిలో ఉన్న ఈ శాసనాన్ని చదివి విశ్లేషించిన హరగోపాల్

వనపర్తి జిల్లా, : తెలంగాణ చారిత్రక సంపదలో మరో కీలక ఆధారం వెలుగులోకి వచ్చింది. వనపర్తి జిల్లా, కోటకొండలోని ఒక శివాలయంలో సుమారు 900 ఏళ్ల నాటి పురాతన శాసనాన్ని చరిత్రకారులు గుర్తించారు. ఇది కల్యాణి చాళుక్య చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుడి (త్రిభువనమల్ల దేవుడు) కాలం నాటిదని నిర్ధారించారు. ఇప్పటివరకు ఎవరికీ అంతుచిక్కని ఈ శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు వెలుగులోకి తెచ్చారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు బైరోజు చంద్రశేఖర్, డా. బైరోజు శ్యామ్ సుందర్, హనుమానగరి వేమారెడ్డి, పంద్రప్రగ్గడ రామారావు ఈ శాసనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేశారు. బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ దీనిని చదివి చారిత్రక వివరాలను విశ్లేషించారు.

శాసనంలో ఏముందంటే?: ఈ శాసనాన్ని క్రీ.శ. 1118 మే 22న వేసినట్లు గుర్తించారు. ఇది 12వ శతాబ్దపు తెలుగన్నడ లిపిలో, కన్నడ భాషలో ఉంది. శాసనం ప్రకారం, కాలాబోలవిరనోలబ మల్లదేశారెడ్డి అనే అధికారి, కదిరాజ అనే పూజారి పాదాలను కడిగి, సింగణగదనకొలను అనే ప్రాంతంలో 3 మత్తరుల తడి భూమిని దానంగా ఇచ్చినట్లు స్పష్టంగా ఉంది.

శాసన స్తంభంపై 'త్రిభువనమల్ల దేవ' అనే పేరు ఉండటంతో ఇది విక్రమాదిత్యుడి కాలం నాటిదని ధ్రువీకరించారు. శిలాఫలకం మరోవైపు 'రామేశ్వర పండిత', 'సూర్యగ్రహణం' అనే పదాలు ఉన్నప్పటికీ, ఆ భాగం కొంత శిథిలమైంది. శ్రీ నాయక అనే మరో అధికారి కూడా భూదానం చేసినట్లు ఇందులో రాశారు. శాసనం ఉన్న స్తంభం మధ్యలో విరిగిపోయి ఉంది. ఇదే ఆలయంలో కాకతీయ శైలిలో ఉన్న చదునైన పానవట్టం (శివలింగం కింది భాగం)తో కూడిన శివలింగం, చాళుక్యుల శైలి నంది, గణపతి విగ్రహాలు, 16వ శతాబ్దానికి చెందిన భక్త ఆంజనేయ విగ్రహం ఉండటం విశేషం. ఈ శాసనం తెలంగాణ ప్రాంతంలో కల్యాణి చాళుక్యుల పాలన, వారి కాలం నాటి భూదానాల సంప్రదాయాలకు బలమైన చారిత్రక సాక్ష్యంగా నిలుస్తుందని పరిశోధకులు తెలిపారు.

జనవరి 25 నుంచి జనగణన..



హైదరాబాద్, : దేశవ్యాప్తంగా 2027 జనాభా గణన (సెన్సస్) నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం తేదీలను ఖరారు చేసింది. 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నట్టు ప్రకటించింది. జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకొనే అవకాశం కల్పించింది. జనాభా గణన పూర్తయిన అనంతరం మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ పరిధిలోని భారత రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ జారీచేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో పునఃప్రచురించాలని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ పరిపాలనాశాఖ నవంబర్ 10న తెలంగాణ అసాధారణ గెజిట్‌లో

జనవరి 10 నుంచి స్వీయ గణనకు అవకాశం

నోటిఫికేషన్ ప్రచురించాలని ఆదేశించింది. జనాభా గణనలో భాగంగా ఇంటింటి సర్వే ప్రారంభానికి ముందే 2027 జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ చేపడుతారు. జనాభా గణనకు సంబంధించి రిఫరెన్స్ తేదీగా మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను (00:00 గంటలు) నిర్ణయించారు. జనగణన వివరాల సేకరణలో ఈ తేదీని ప్రామాణికంగా తీసుకోనున్నారు. కొన్ని రాష్ట్రాలకు మినహాయింపు: కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం మణిపూర్ (తదుపరి ప్రకటన వెలువడే వరకు), గోవా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంతోపాటు హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాలకు ఈ షెడ్యూల్ నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రకటించిన తేదీల ప్రకారం జనాభా గణన నిర్వహించనున్నారు. తెలంగాణలో జనగణన ప్రక్రియకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్లు, ప్రధాన జనగణన అధికారులు, సంబంధిత శాఖల అధిపతులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు జారీచేశారు.

పామర్రు శివాలయంలో ఘనంగా.. కార్తీక మాసోత్సవాలు!



వేకువజాము నుంచే పోటెత్తిన భక్తులు
శివనామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం
నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు, దీపోత్సవాలు

పామర్రు, : శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పామర్రులోని స్థానిక శివాలయంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హరిహరుల ఆరాధనకు ఎంతో విశిష్టమైన ఈ మాసంలో తొలి రోజే కావడంతో భక్తులు వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కొలువైన శ్రీ హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి సన్నిధి కూడా అయ్యప్ప దీక్షాపరులు, సాధారణ భక్తులతో కిటకిటలాడింది. దీక్షాపరులు స్వామివారి సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగించి 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ భక్తిభావాన్ని చాటుకున్నారు. ఉదయాన్నే స్థానిక కాలువలో సంప్రదాయబద్ధంగా పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు తడి బట్టలతో శివాలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామివారి సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక దీపాలంకరణలు చేశారు. 'హరహర మహాదేవ శంభో శంకర' అంటూ శివనామస్మరణ చేయడంతో ఆలయ ప్రాంగణమంతా మారుమోగింది. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి శివకేశవుల కృపకు పాత్రులయ్యారు. కార్తీక మాసం పొడవునా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, దీపోత్సవాలు కొనసాగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు లంకా భీష్మ కుమార్ తెలిపారు.

బతికుండగానే డెత్ సర్టిఫికెట్లు..

సిద్దిపేటలో వెలుగులోకి వచ్చిన షాకింగ్ మోసం!

చేర్యాల, : మరణించిన వ్యక్తి పేరిట డెత్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు పంచాయతీ అధికారులు నానా తిప్పలు పెడుతుంటారు. కానీ సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం రాంపూర్‌లో మాత్రం బతికి ఉన్న వ్యక్తుల పేరిట డెత్ సర్టిఫికెట్లు జారీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూక్యా మధు రాంపూర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో రమేశ్ అనే యువకుడు స్నేహంగా ఉండటం తో ఆయనకు పంచాయతీకి సంబంధించి డిజిటల్ కీ, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ చెప్పడంతోపాటు సదరు డాంగిల్‌ను ఇచ్చాడు. రమేశ్ డిజిటల్ కీ ఉపయోగించి 21 మందికి డెత్ సర్టిఫికెట్లు, మరో ముగ్గురికి బర్త్ సర్టిఫికెట్లు జారీ చేశాడు. ఇన్సూరెన్స్ డబ్బులు, భూమి క్రయవిక్రయాలు తదితర అంశాలకు ఉపయోగపడే డెత్, బర్త్ సర్టిఫికెట్లను పంచాయతీ కార్యదర్శికి తెలియకుండా రమేశ్ జారీ చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు ఈ తతం గం కొనసాగింది. హైదరాబాద్‌లోని బోయినపల్లి ఇంటర్‌నెట్ సెంటర్ నుం చి రమేశ్ ధ్రువీకరణ పత్రాలు జారీ చే యడం మొదలుపెట్టి



రాంపూర్‌లో తన కుటుంబ సభ్యులకు మూడు, జనగా మ జిల్లా, హైదరాబాద్‌లోని బోయిన పల్లి, పీర్జాదిగూడ తదితర ప్రాంతాల్లో వ్యక్తులకు సర్టిఫికెట్లు ఇచ్చినట్టు తెలిసింది. విషయం బయటకు పొక్కడం తో జీపీ కార్యదర్శి, ప్రైవేట్ వ్యక్తిపై ఫి ర్యాదు చేయాలని కలెక్టర్ చేర్యాల ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కేసులో కార్యదర్శి మధును సస్పెండ్ చేశారు. ఎంపీడీవో సుధీర్ ఫిర్యాదు మేరకు ఎస్సై అపూర్వరెడ్డి ఇద్దరిపై కేసు నమో దు చేశారు. కార్యదర్శి మధును విచారిస్తున్నామని, రమేశ్ కోసం గాలిస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

కిర్లంపూడి పీఎస్ లో పోలీసు విచారణకు హాజరైన అంబటి రాంబాబు



- ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో పోలీసులను అడ్డుకున్నారని కేసు
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియల నిర్వహణ వేళ వివాదం
- బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 కింద అంబటికి గతంలో నోటీసులు జారీ చేసిన పోలీసులు

కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో పోలీసు విచారణకు వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు హాజరయ్యారు. దివంగత నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై నమోదైన కేసులో ఆయన పోలీసుల ఎదుట విచారణను ఎదుర్కొంటున్నారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూసిన అనంతరం జులై 15న ఆయన స్వగ్రామం కిర్లంపూడిలో అంత్యక్రియలు జరిగాయి. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ముద్రగడ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో (గార్డ్ ఆఫ్ ఆనర్) నిర్వహించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే, ముద్రగడ కుటుంబ సభ్యులు, వైసీపీ నేతలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు.పోలీసులు గౌరవ వందనం సమర్పించేందుకు ప్రయత్నించిన సమయంలో అంబటి రాంబాబు, ఆయన అనుచరులు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న సిబ్బందిపై తోసివేతకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్ఐ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కిర్లంపూడి పోలీసులు జూలై 16న అంబటి రాంబాబుతో పాటు పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 కింద గుంటూరులోని అంబటి రాంబాబు నివాసంలో పోలీసులు నోటీసులు అందించారు. ఈ వివాదంపై గతంలో స్పందించిన అంబటి రాంబాబు... తాము ముద్రగడ చివరి కోరికను అమలు చేశామని, ఆ బాధ్యత తమ పైన ఉందని చెప్పుకొచ్చారు.

మమత కాళీ పూజ వెలవెల..



- బెంగాల్‌లో అధికారం కోల్పోయాక తొలిసారి కాళీ పూజ నిర్వహించిన మమత
- గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గిన నేతలు, అధికారుల హాజరు
- పూజకు దూరంగా ఉన్న మాజీ మంత్రులు ఫిర్‌హద్ హకీమ్, అరూప్ బిస్వాస్
- హాజరైన అభిషేక్ బెనర్జీ, సౌగత రాయ్, కునాల్ ఘోష్ వంటి నేతలు
- రాజకీయ అధికారం మారడంతో వైభవం తగ్గిందని విశ్లేషణలు

పశ్చిమ బెంగాల్: శ్చిమ బెంగాల్ రాజకీయాల్లో అధికారం మారిన తర్వాత చోటుచేసుకుంటున్న మార్పులకు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ నివాసంలో జరిగిన కాళీ పూజ అద్దం పట్టింది. అధికారం కోల్పోయి, మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఆదివారం తన నివాసంలో నిర్వహించిన ఈ పూజకు ఒకప్పటి రాజకీయ వైభవం కొరవడింది. గత 15 ఏళ్లలో తొలిసారిగా మాజీ సీఎంగా మమత ఈ పూజ చేయడం గమనార్హం. ప్రతి ఏటా కోల్‌కతాలోని హరీశ్ ఛటర్జీ స్ట్రీట్‌లో ఉన్న మమతా బెనర్జీ నివాసంలో కాళీ పూజ అత్యంత వైభవంగా జరుగుతుంది. ఇది కేవలం మతపరమైన కార్యక్రమమే కాకుండా, టీఎంసీ శక్తి ప్రదర్శనకు, రాజకీయ కేంద్రానికి వేదికగా ఉండేది. మంత్రులు, ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, టాలీవుడ్ ప్రముఖులు, వ్యాపారవేత్తలతో ఆమె ఇల్లు కిటకిటలాడేది. అయితే, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి తర్వాత బీజేపీ అధికారంలోకి రావడంతో ఈసారి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పూజా విధానాలు, విగ్రహం, ఆచారాల్లో మార్పు లేనప్పటికీ, హాజరైన వారి సంఖ్యలో భారీ తేడా కనిపించింది. గతంలో ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించే మాజీ మంత్రులు ఫిర్‌హద్ హకీమ్, అరూప్ బిస్వాస్ వంటి కీలక నేతలు ఈసారి కనిపించలేదు. మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ తన భార్యతో కలిసి సాయంత్రం హాజరయ్యారు. రాజ్యసభ సభ్యులు సౌగత రాయ్, సాగింది. మొత్తంమీద, కుటుంబ సంప్రదాయంగా పూజ కొనసాగినప్పటికీ, అధికారం చేతులు మారడంతో ఈ వేడుక తన రాజకీయ ప్రాభవాన్ని కోల్పోయిందనేది స్పష్టంగా కనిపించింది.

కంచె చేను మేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వమే భూములు అమ్ముతోంది

కూకట్‌పల్లి : కంచె చేను మేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజా అవసరాలకు వదిలిన భూములను అమ్ముకుంటుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శించారు. హౌసింగ్ బోర్డు భూముల వేలానికి వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో ఫోరం మాల్ ఎదురుగా హౌసింగ్ బోర్డు శాఖ వేలానికి పెట్టిన భూమిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కూకట్‌పల్లి మండలం సర్వే నంబర్ 1009లోని హౌసింగ్ బోర్డుకు చెందిన 2,696 గజాల భూమిని ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి అమ్మకానికి పెడుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కూకట్‌పల్లి వంటి అత్యధిక జనాభా కలిగిన ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం భూములను కేటాయించాల్సింది పోయి, వాటిని అమ్ముకోవడం ఏమిటని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. హౌసింగ్ బోర్డు భూముల అమ్మకాలపై ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని గతంలోనే తాను ఎంపీగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. అదే విధంగా కూకట్‌పల్లిలో హుడా ట్రాక్ పార్కు 3 ఎకరాల భూమిని సైతం ప్రభుత్వం విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వేలం జరగకుండా అడ్డుకుంటామని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఆక్రమణలకు గురైన లక్షల ఎకరాల భూములను కాపాడేందుకు పోరాడతానని చెప్పిన రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకున్నారని ఆరోపించారు. భూములను కాపాడతానని చెప్పిన రేవంత్ రెడ్డి నేడు హౌసింగ్ బోర్డు భూములను ఎందుకు అమ్ముతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి భూములు ఇచ్చిన రైతులు ఎవరూ సంతోషంగా ఇవ్వరని, కూకట్‌పల్లి ట్రాక్ పార్కు ఉన్న స్థలాన్ని గత ఐదు దశాబ్దాల క్రితం రైతుల నుంచి సేకరించారని, హౌసింగ్ బోర్డు భూములను సైతం రైతుల నుంచి సేకరించినవేనని అన్నారు. రైతుల నుంచి సేకరించిన భూములను నేడు ప్రజల అవసరాలకు, ఆవాసాలకు వినియోగించాల్సింది పోయి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారి రియల్ మాఫియాకు అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశాల్లో పేద ప్రజలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని చెబుతున్నారు. మరి కూకట్‌పల్లి ప్రాంతంలోని భూములను పేదల ఇళ్ల నిర్మాణానికి ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉన్నవారి కోసం ఆలోచిస్తోందా? లేనివారి కోసం ఆలోచిస్తోందా అని ప్రశ్నించారు.

ప్రకాశం జిల్లాలో కాలి బూడిదైన ప్రైవేట్ బస్సు..



- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- కడప నుంచి విజయవాడ వెళ్తుండగా ఘటన
- ముందు టైరు పేలడంతో మంటలు చెలరేగినట్లు నిర్ధారణ
- ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ప్రకాశం జిల్లా: ప్రకాశం జిల్లాలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. 33 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రయాణికులంతా సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన వలేటివారిపాలెం మండలం చుండి సమీపంలో అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 33 మంది ప్రయాణికులతో కడప నుంచి విజయవాడకు బయలుదేరింది. మార్గమధ్యంలో చుండి వద్దకు రాగానే బస్సు ముందు టైరు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్, వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశారు. టైరు పేలిన వెంటనే మంటలు చెలరేగడాన్ని గమనించిన డ్రైవర్, ప్రయాణికులను అప్రమత్తం చేసి అందరినీ హుటాహుటిన బస్సు నుంచి కిందకు దించేశారు. ప్రయాణికులంతా కిందకు దిగిన కొద్దిసేపటికే మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ సమయస్ఫూర్తి వల్లే పెను విషాదం తప్పిందని ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అంగన్వాడీల పోషకాహారంతో ఎంతో మేలు

అంగన్వాడీల సేవలు సద్వినియోగం చేసుకోవాలి
సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
గంభీరావుపేట మండలం గజసింగవరంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమం
గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన









రాజన్న సిరిసిల్ల /గంభీరావుపేట: నవంబర్10 : అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారంతో పిల్లలు, గర్భిణులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.
గంభీరావుపేట మండలం గజసింగవరంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల పేరిట కార్యక్ర మాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రానికి ఎంత మంది పిల్లలు వస్తున్నారో ఆరా తీసి.. వారి ఎత్తు, బరువు చూసి.. ఆరోగ్య కార్డుల్లో వివరాలు నమోదు చేసిన తీరును పరిశీలించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, మందులు పరిశీలించి.. పలు సూచనలు చేశారు. పలువురు గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేశారు.
ఈ సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, బెల్లం, నువ్వులు బాలామృతంతో సిద్ధం చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో కొనసాగిస్తున్నామని, కేంద్రాల్లో సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలా తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు నమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని, దీంతో వారి బంగారు భవితకు బాటలు పడతాయని స్పష్టం చేశారు. సామ్, మామ్ పిల్లలపై సర్పంచ్, అంగన్వాడీ కేంద్రం బాధ్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ తీవ్ర పోషకాహార లోపం, తీవ్రమైన తక్కువ బరువు, మధ్యస్థ తక్కువ బరువు ఉన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తారని వివరించారు.నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వారు తయారు చేసిన బాలామృతం, బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బాలామృతం ప్లస్ తో పిల్లలకు ఇష్టమైన ఆహార పదార్థాలు తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. నీరు వేడి చేసి చల్లారిన తర్వాత ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. పిల్లల ఆరోగ్యం, చదువు భవిష్యత్తు తల్లితండ్రుల ఇద్దరి బాధ్యతని పేర్కొన్నారు. సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు.
ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి: గర్భిణులు బాలింతలు మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి పోషకాహారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఎదుగుదల లోపించిన పిల్లలకు వైద్యం అందించాలి 5 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలు ఎదుగుదల లోపిస్తే సమీప అంగన్వాడి కేంద్రాల వారికి సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎదుగుదల లోపాలు గల పిల్లలు, చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల, నడవలేని వాళ్లు, పుట్టుకతో వచ్చే లోపల గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్యలు, సరిగా మాట్లాడలేని పిల్లలు, రక్తహీనత, పోషకాహారం లోపం గల పిల్లలను బాల భరోసా కింద అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాన్ని గుర్తిస్తారని తెలిపారు. ఆర్ బీ ఎస్ కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి ..ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. సేవలను సద్వినియం చేసుకోవాలని సూచించారు. ఉన్నత వైద్య సేవలు కరీంనగర్, హైదరాబాద్ లో అందిస్తారని వెల్లడించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి హనుమంతు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, సర్పంచ్ ఉమ్మారెడ్డి విమల తదితరులు పాల్గొన్నారు.

'రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

- పంట నష్ట పరిహారం అందించలేని దుస్థితి
- రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన
- నష్టపోయిన పంటలను రైతులతో కలిసి పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్





కోదాడ, నవంబర్ 10 : దళారీ వ్యవస్థకు వత్తాసు పలుకుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతుందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం చిలుకూరు మండల కేంద్రంలో పర్యటించి, రైతుల పంటను, కొనుగోలు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం శ్రమించి వరి సాగు చేశారని, అయితే ప్రభుత్వం నుండి రైతులకు కనీస సహాయం అందలేదన్నారు. రైతుబంధు ఇవ్వలేదని, సకాలంలో సాగునీరు, విద్యుత్తు అందించలేదన్నారు. యూరియా కూడా సరఫరా చేయలేని అసమర్థ స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తేమ పేరుతో దళారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారని విమర్శించారు. తూకం, తాలు పేరుతో బస్తాకు రెండున్నర కిలోల చొప్పున అదనంగా కోత విధిస్తూ వ్యాపారస్తులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. నిన్నటి వరకు రూ. 4,200 ఉన్న ధాన్యం ధరను, నేడు రూ. 3,200 లకు తగ్గించారని విమర్శించారు. క్వింటాకు ఏకంగా వెయ్యి రూపాయలు తగ్గించి రైతుల పొట్ట కొడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. ఒకవైపు రైతుకు కనీస మద్దతు ధర దక్కడం లేదని, మరోవైపు మార్కెట్లో బియ్యం ధరలు చుక్కలను అంటుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కిలో బియ్యం ధర రూ. 90 దాటిపోవడంతో సామాన్యులు, కూలీలు బియ్యం కొనుక్కోలేని దయనీయ పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి అండదండలతోనే ఈ బ్లాక్ మార్కెట్ దందా యథేచ్ఛగా కొనసాగుతోందని, అధికారులు కేవలం కాగితపు ప్రకటనలకే పరిమితమయ్యారని ఆయన విమర్శించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, వరి వేయవద్దని చెప్పిన ప్రభుత్వ మాట విని పొలాలను పడావు పెట్టిన రైతులకు ఇంతవరకు ఎలాంటి కరువు భత్యం అందలేదన్నారు. కరువు మండలాలుగా ప్రకటించినా నయా పైసా సాయం చేయలేదని, తుఫానుల వల్ల దెబ్బతిన్న పొలాలకు నష్టపరిహారం అంచనా వేయలేదన్నారు. కేంద్ర బృందాలు పరిశీలించిన దాఖలాలు లేవని, దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలని మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. తక్షణమే రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని, దళారుల దోపిడీని అరికట్టి రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కంచె చేను మేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వమే భూములు అమ్ముతోంది



కూకట్పల్లి : కంచె చేను మేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజా అవసరాలకు వదిలిన భూములను అమ్ముకుంటుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శించారు. హౌసింగ్ బోర్డు భూముల వేలానికి వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో ఫోరం మాల్ ఎదురుగా హౌసింగ్ బోర్డు శాఖ వేలానికి పెట్టిన భూమిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కూకట్పల్లి మండలం సర్వే నంబర్ 1009లోని హౌసింగ్ బోర్డుకు చెందిన 2,696 గజాల భూమిని ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి అమ్మకానికి పెడుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కూకట్పల్లి వంటి అత్యధిక జనాభా కలిగిన ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం భూములను కేటాయించాల్సింది పోయి, వాటిని అమ్ముకోవడం ఏమిటని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. హౌసింగ్ బోర్డు భూముల అమ్మకాలపై ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని గతంలోనే తాను ఎంపీగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. అదే విధంగా కూకట్పల్లిలో హుడా ట్రాక్ పార్కు 3 ఎకరాల భూమిని సైతం ప్రభుత్వం విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వేలం జరగకుండా అడ్డుకుంటామని అన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఆక్రమణలకు గురైన లక్షల ఎకరాల భూములను కాపాడేందుకు పోరాడతానని చెప్పిన రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకున్నారని ఆరోపించారు. భూములను కాపాడతానని చెప్పిన రేవంత్ రెడ్డి నేడు హౌసింగ్ బోర్డు భూములను ఎందుకు అమ్ముతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ బ్రోకర్గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి భూములు ఇచ్చిన రైతులు ఎవరూ సంతోషంగా ఇవ్వరని, కూకట్పల్లి ట్రాక్ పార్కు ఉన్న స్థలాన్ని గత ఐదు దశాబ్దాల క్రితం రైతుల నుంచి సేకరించారని, హౌసింగ్ బోర్డు భూములను సైతం రైతుల నుంచి సేకరించినవేనని అన్నారు. రైతుల నుంచి సేకరించిన భూములను నేడు ప్రజల అవసరాలకు, ఆవాసాలకు వినియోగించాల్సింది పోయి రియల్ ఎస్టేట్ బ్రోకర్గా మారి రియల్ మాఫియాకు అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశాల్లో పేద ప్రజలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని చెబుతున్నారు. మరి కూకట్పల్లి ప్రాంతంలోని భూములను పేదల ఇళ్ల నిర్మాణానికి ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉన్నవారి కోసం ఆలోచిస్తోందా? లేనివారి కోసం ఆలోచిస్తోందా అని ప్రశ్నించారు.

నీటి చుక్కే జీవధార.. కెప్టెన్ బంజారాలో..

ఇంకుడు గుంతల పనుల ప్రారంభం!



కామేపల్లి, నవంబర్ 10 : వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జల మట్టాన్ని పెంచడమే లక్ష్యంగా కామేపల్లి మండల పరిధిలోని కెప్టెన్ బంజార గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి ఆరెం ఆచమ్మ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా ప్రారంభించారు. నీటి ఎద్దడిని నివారించడంలో ఇంకుడు గుంతల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ నిర్మాణాలను పూర్తి చేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ?ఈ సందర్భంగా ఎంపీడీవో డి. సోమ్లాల్ నాయక్ మాట్లాడుతూ.. జల సంరక్షణే మన భవిష్యత్తుకు అసలైన భరోసాని స్పష్టం చేశారు. వర్షపు నీరు వృథాగా పోకుండా నిలిపినప్పుడే రాబోయే తరాలకు తాగు, సాగు నీటి కొరత లేకుండా చూడగలమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మాణం పూర్తి చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు. ?ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ, సహాయ ప్రాజెక్టు అధికారి శ్రీరాణి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వెంకటేశ్వర్లు, సాంకేతిక సహాయకులు భాస్కర్, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బందితో పాటు గ్రామస్తులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.50 లక్షల విరాళం



శేరిలింగంపల్లి: యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ పార్ట్‌నర్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి రూ.50 లక్షల విరాళం అందించారు. మంగళవారం మాదాపూర్ మైండ్ స్పేస్ లోని పెరెల్ క్లబ్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్‌కు విరాళం చెక్కును అందజేశారు. ఈ నిధులను పాఠశాలలో తరగతి గదులు, సైన్స్, టెక్నాలజీ ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా వనతులు, డిజిటల్ విద్యా నదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. పోలీసు సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ ప్రజల కుటుంబాలకు చెందిన పిల్లలకు సైతం సమాన ప్రాతిపదికన నాణ్యమైన విద్యను అందించడమే ఈ పాఠశాల లక్ష్యం.విరాళం అందించిన డాక్టర్ శ్రీనివాసరెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా అభినందించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతర రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు కల్పించేలా పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పోలీసులంటే తనకు ఎంతో గౌరవమని, సమాజ భద్రత కోసం వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విద్య ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, ఎస్ఎస్సీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఐటీ రంగానికి చెందిన సంస్థలు, ఆర్టీసీ, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భద్రతా సిబ్బందికి యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమం



మధిర : వ్యవసాయ మార్కెట్ కమిటీ, మధిర పరిధిలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులకు నూతన యూనిఫామ్‌లను ఈరోజు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్బండారు నరసింహారావు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పి. వీరాంజనేయులు పాల్గొని సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని,వారి సేవలను గుర్తిస్తూ అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు తప్పిన కేడీ రేవంత్ రెడ్డి
మాజీ ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి: ప్రజలకు ఇచ్చిన హామీలు తప్పిన కేడీ సీఎం రేవంత్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కేడి పాలన రాజ్యమేలుతుంది. కెసిఆర్ అసెంబ్లీకి వస్తే.. రేవంత్ లాగు తడుస్తదన్నారు. మూడేళ్ల నుండి ఒక్క పిల్లర్ ను రిపేర్ చెయ్యలేని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు.
మంత్రుల నియోజకవర్గాల్లోనే కరువు మండలాలు ఉన్నాయా? రాష్ట్రంలో మరెక్కడా లేవా అని ప్రశ్నించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఒక్క మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ఎంపిక చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌కు నితిన్ నబీన్

- ఈ నెల 18న కరీంనగర్‌కు నితిన్ నబీన్ రాక
- లక్ష మందితో మహా పాదయాత్రకు బీజేపీ ఏర్పాట్లు
- బండి సంజయ్ నేతృత్వంలో కార్యక్రమ నిర్వహణ
- గాంధీ సర్కిల్ నుంచి కమాన్ వరకు యాత్ర
- పాదయాత్రలో పాల్గొననున్న రాంచందర్‌రావు





కరీంనగర్: తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానున్నారు.

ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో లక్ష మందితో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'సర్' అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని బండి సంజయ్ నిర్ణయించారు. గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర సాగనుంది. ఇందులో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బండి సంజయ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు బండి సంజయ్ కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సమీకరించాలని సూచించారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

19న మరో పథకం ప్రారంభం..

మంత్రి వివేక్ కీలక ప్రకటన





సిద్దిపేట జిల్లా, నవంబరు 10: సీఎం రేవంత్‌రెడ్డి రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా పథకాన్ని సిద్దిపేట వేదికగా 19వ తేదీన ప్రారంభిస్తారని తెలంగాణ మంత్రి వివేక్ వెంకట్ స్వామి పేర్కొన్నారు. ఈ పథకాన్ని అర్హులకు ఇస్తామని స్పష్టం చేశారు. రూ.20 లక్షల విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌నూ అమలు చేస్తామని తెలిపారు. ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో పట్టణంలో సభ స్థలి కోసం పలు ప్రాంతాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ హైమవతి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు.

మా ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు..: తమ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మంత్రి వివేక్ వెంకట్ స్వామి వ్యాఖ్యానించారు. ఈ నెల 19వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి సభను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభ కోసం మూడు, నాలుగు స్థలాలు చూశామని.. ఒకటి ఫైనల్ చేశామని వెల్లడించారు. తెలంగాణలో మాదిరిగా పెద్దఎత్తున ఇందిరమ్మ ఇళ్లను ఎక్కడా కట్టలేదని మంత్రి వివేక్ వెంకట్ స్వామి పేర్కొన్నారు.

అన్ని పథకాలను అమలు చేస్తున్నాం: చిలక పచ్చరంగు ఇందిరమ్మ చీరలను సీఎం రేవంత్‌రెడ్డి 19వ తేదీన ఆవిష్కరిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మూడేళ్లలో ఎన్నికల ముందు చెప్పిన అన్ని పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. సిద్దిపేట సభ ద్వారా తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు భవిష్యత్తులో అమలు చేసే మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రకటిస్తారని అన్నారు. సీఎం సభకు సిద్దిపేట చుట్టూ పక్కల ఉన్న నియోజకవర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరవుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ఏపీ కేబినెట్ నిర్ణయాలు..

పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
- కొత్త పారిశ్రామిక పాలసీలకు గ్రీన్ సిగ్నల్
- భారీ పరిశ్రమలకు ఏపీ కేబినెట్ ఆమోదముద్ర



అమరావతి,: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేబినెట్ పలు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఈ సమావేశంలో ఏపీజీసీ–ఎక్స్‌ఆర్ పాలసీ 2026–31, ఏపీ రోబోటిక్స్ – ఫిజికల్ ఏఐ విధానాలతో పాటు సెమీ కండక్టర్ పాలసీ సవరణలకు మంత్రి వర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో రూ.31,387 కోట్లతో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో రూ.4,000.20 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అలాగే భోగాపురంలో రిలయన్స్ గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్‌కు 25 ఎకరాలు, తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయింపునకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ యూనిట్ కు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉపాధి లభించనుంది. పశ్చిమ గోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయించారు. మరోవైపు, రాష్ట్రంలో రోడ్డు భద్రత కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, తిరుమల శ్రీవారి ఆలయంలో 'ప్రధాన సన్నిధి యాదవ', 'సన్నిధి యాదవ' పోస్టుల సృష్టికి కేబినెట్ నిర్ణయించింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎంఆర్ టెక్నాలజీతో అణు విద్యుత్ ప్లాంట్ల సాధ్యాసాధ్యాల పరిశీలనకు, రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపునకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

షామీర్‌పేట సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

- కొంపల్లికి చెందిన 52 ఏళ్ల రియల్ ఎస్టేట్ వ్యాపారి గౌరీ శంకర్ వరప్రసాద్ ఆత్మహత్య
- లక్ష్మాపూర్ చెరువు కట్ట సమీపంలో పురుగుల మందు తాగి బలవన్మరణం
- రియల్ ఎస్టేట్‌లో పెట్టిన పెట్టుబడులతో తీవ్ర ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయిన వ్యాపారి
- ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న శామీర్‌పేట పోలీసులు



షామీర్‌పేట: మేడ్చల్ జిల్లా కొంపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గౌరీ శంకర్ వరప్రసాద్ (52) షామీర్‌పేట పరిధిలో సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. ముంచింతలపల్లి సమీపంలోని లక్ష్మాపూర్ చెరువు కట్ట వద్ద ఆయన గుర్తుతెలియని పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. షామీర్‌పేట పోలీసుల వివరాల ప్రకారం.. గౌరీ శంకర్ వరప్రసాద్ గత కొంతకాలంగా రియల్ ఎస్టేట్ రంగంలో వ్యాపారం నిర్వహిస్తున్నారు. అయితే, ఆయన పెట్టిన పెట్టుబడులు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్నారు. అప్పులు పెరిగిపోవడం, వ్యాపారంలో నష్టాలు రావడంతో గత కొద్ది రోజులుగా ఆయన తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు ప్రత్యామ్నాయంగా పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటు చేయాలని వరప్రసాద్ భావించారు. ఆ వ్యాపారానికి తగిన స్థలాన్ని వెతికే క్రమంలో ఆయన తన ద్విచక్ర వాహనంపై షామీర్‌పేట పరిసర ప్రాంతాలకు వెళ్లారు. లక్ష్మాపూర్ చెరువు కట్ట సమీపంలో ఆయన సంచరిస్తుండటాన్ని స్థానిక గ్రామస్తులు చివరిసారిగా గమనించారు. ఆ తర్వాత తీవ్ర నిరాశతో ఆయన వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగినట్లు తెలుస్తోంది.

చెరువు కట్ట వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న వరప్రసాద్‌ను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న శామీర్‌పేట పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని, ఘటనపై కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ప్రపంచ సంక్షోభాల్లో..

భారత్ వైపే చూపు

మోదీ నాయకత్వంపై బీజేపీ వ్యాఖ్యలు

- మోదీకి ప్రపంచ నేతల్లో విస్తృత ఆదరణ ఉందన్న బీజేపీ
- గత 12 ఏళ్లలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడి
- విదేశాంగ అంశాలపై జాగ్రత్తగా మాట్లాడాలన్న కాంగ్రెస్
- భారత్–ఉక్రెయిన్ సంబంధాల బలోపేతంపై జెలెన్‌స్కీ–మోదీ చర్చ
- శాంతియుత పరిష్కారానికి సహకరిస్తామని మోదీ హామీ



డిల్లీ: ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు, ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు అందరి దృష్టి భారత్‌పైనే ఉంటోందని బీజేపీ పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీకి ప్రపంచ నేతల్లో విస్తృత ఆదరణ ఉందని తెలిపింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో మోదీ ఫోన్‌లో మాట్లాడిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో భారత ప్రతిష్ఠను మోదీ పెంచారని అన్నారు. ప్రపంచంలో ఏ సంక్షోభం తలెత్తినా, రెండు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు ఏర్పడినా అంతర్జాతీయ సమాజం భారత్ వైపు చూస్తోందని చెప్పారు. జెలెన్‌స్కీతో తాజా సంభాషణ దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ భిన్నంగా స్పందించారు. అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ ఉన్న స్థానం దృష్ట్యా ఇలాంటి అంశాలపై చాలా జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. జెలెన్‌స్కీతో సోమవారం ఫోన్‌లో మాట్లాడిన వివరాలను మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారత్–ఉక్రెయిన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధం, మానవతా సమస్యలు, శాంతి ప్రయత్నాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. యుద్ధానికి శాంతియుత పరిష్కారం లభించేలా భారత్ అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు. మరోవైపు, అబుదాబిలో జరగనున్న శాంతి చర్చలకు ముందు తాజా పరిణామాలను మోదీకి వివరించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. చర్చల కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని చెప్పారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు రష్యా కూడా ముందుకు రావాలని కోరారు. యుద్ధాన్ని కొనసాగించడం కంటే ముగించడమే ముఖ్యమని మోదీ గతంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు చెప్పారని గుర్తుచేశారు.

నకిలీ ఉద్యోగ పత్రాలతో ఐసీఐసీఐ బ్యాంకుకు రూ.30 లక్షల టోకరా..

ఇబ్రహీంపట్నం : నకిలీ గుర్తింపు, ఉద్యోగ ధ్రువీకరణ పత్రాలతో ఐసీఐసీఐ బ్యాంకును మోసం చేసి రూ.30 లక్షల రుణం పొందిన వ్యవహారం ఇబ్రహీంపట్నం పోలీసుల విచారణలో వెలుగుచూసింది. నకిలీ ఆధార్, పాన్ కార్డులతో పాటు ఉద్యోగ నియామక పత్రాలు, జీతపు స్లిప్పులు సృష్టించి పక్కా ప్రణాళికతో ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో రామావత్ గోపాల్, పులి సురేష్ బాబు కలిసి గంటల శంకర్ పేరుతో నకిలీ గుర్తింపు, ఉద్యోగ ధ్రువీకరణ పత్రాలు తయారు చేసినట్లు వెల్లడైంది. వీటి ఆధారంగా బెంగళూరులోని క్యాప్‌కో టెక్నాలజీస్ సంస్థలో సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నట్లు తప్పుడు రికార్డులు సృష్టించారు. అనంతరం ఈ పత్రాలను ఉపయోగించి గంటల శంకర్ పేరుతో ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.30 లక్షల రుణం మంజూరు చేయించుకున్నారు.

ఈ వ్యవహారంలో రుణం మంజూరుకు : హకరించినందుకు రామావత్ సురేష్‌కు రూ.6.70 లక్షలు కమిషన్‌గా చెల్లించినట్లు పోలీసుల విచారణలో తేలింది. అంతేకాకుండా, గంటల శంకర్ పేరుతో క్రెడిట్ కార్డు పొందిన రామావత్ సురేష్, దానిపై ఉన్న రూ.3 లక్షల క్రెడిట్ పరిమితిని కూడా వినియోగించుకున్నట్లు గుర్తించారు. ఈ కేసులో రామావత్ గోపాల్ (ఏ1), పులి సురేష్ బాబు (ఏ2), రామావత్ సురేష్ (ఏ3), గంటల శంకర్ (ఏ4), గంటల శ్రీనివాస్ (ఏ5) పేర్లు నిందితుల జాబితాలో ఉన్నాయి. వీరిలో ఏ1, ఏ2లు సుమిక్రో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లుగా ఉన్నట్లు పోలీసు రికార్డుల్లో పేర్కొన్నారు. నకిలీ పత్రాల తయారీ, బ్యాంకు రుణం పొందడం, క్రెడిట్ కార్డు వినియోగం తదితర అంశాలపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో బ్యాంకు రుణాలు పొందడం, ఇతరుల గుర్తింపు వివరాలను దుర్వినియోగం చేయడం తీవ్రమైన నేరమని, ఇలాంటి మోసాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



శ్రీ చైతన్య పాఠశాలలో ప్రకాశించిన చిన్నారి నక్షత్ర

ఆటల పోటీలలో మొదటి బహుమతి ప్రతిభ!



పాల్వంచ, నవంబర్ 10: పాల్వంచ పట్టణం పరిధిలోని ఓడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో తాజాగా మంగళవారం నిర్వహించిన ఆటల పోటీలలో చిన్నారి, విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీలలో ఎల్ కే జి తరగతి అభ్యసిస్తున్న చిరునవ్వుల విద్యార్థిని మొల్లుగూరి నక్షత్ర అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న నక్షత్ర, అద్భుతమైన ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకుంటూ మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విజయం ద్వారా ఆమె గోల్డ్ మెడల్ (స్వర్ణ పతకం) మరియు ప్రతిభ సర్టిఫికెట్‌ను గెలుచుకుంది. ప్రిన్సిపాల్ మిరియాల రాణి మరియు క్లాస్ టీచర్ చందన బహుమతులను అందజేశారు. చిన్న వయసులోనే క్రీడల పట్ల ఆసక్తిని కనబరుస్తూ, పాఠశాల స్థాయిలో మొదటి స్థానం సాధించిన నక్షత్రను పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మరియు తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మిరియాల రాణి మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని, చిన్ననాటి నుంచే ఇలాంటి పోటీలలో పాల్గొనడం ద్వారా పిల్లలలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తండ్రి సందీప్ (విలేఖరి), తల్లి ఎమ్ ఈశ్వరి(జెన్కో ఎంప్లాయ్) తన కుమార్తె నక్షత్ర సాధించిన ఈ విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో నక్షత్ర మరిన్నిన్నత శిఖరాలను అధిరోహించాలని అందరూ ఆకాంక్షించారు.

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి : స్పీకర్

వికారాబాద్ ప్రతినిధి : జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, త్వరలో జర్నలిస్టుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) వికారాబాద్ జిల్లా తృతీయ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. మహాసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఎండనకా, వాననకా, రాత్రనకా, పగలనకా జర్నలిస్టులు ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చాలా సానుకూలంగా ఉందన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలనే దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, వారి సమస్యలను తీర్చడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఇక్కడ చాలా మంది సీనియర్లు ఉన్నారని, 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న జర్నలిస్టు మిత్రులు ఉన్నారని తెలిపారు. తప్పకుండా వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, వారి కష్టసుఖాల్లో తోడుగా ఎల్లప్పుడూ ఉంటామని అన్నారు. గత మూడేళ్లుగా ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మీడియా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే నాలుగో స్తంభం (ఫోర్త్ ఎస్టేట్) అని పేర్కొన్నారు.